
సాక్షి పల్నాడు

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



మాతృభాషా దినోత్సవం

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 534.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,452 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనక దుర్గమ్మకు ధాన్యాభిషేకం

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో వెంచేసియున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో శుక్రవారం ధాన్యాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా శోభాయాత్ర



మాచర్ల: పట్టణంలో శుక్రవారం గాయత్రీ మహాయజ్ఞం కనులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 500 మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. తొలుత కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశాక కలశాలతో ముందుకు సాగారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి వెళ్లి గాయత్రీ మహా యజ్ఞంలో పాల్గొన్నారు. భారీగా దీప యజ్ఞం నిర్వహించారు. అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతికుంజ్ హరిద్వార్, మాచర్ల శాఖ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. సీఐ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వ్యాఘ్ర వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాలుగో రోజు స్వామి వారు వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవ కైంకర్యకర్తలుగా పట్టణానికి చెందిన సింధే నారాయణరావు వ్యవహరించారు. ఆలయంలో భక్తులకు దాతలు పొంగలి ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థాన ఈవో జేవీ నారాయణ ఈ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.

ఇంటర్ దూరవిద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ, జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇంటర్మీడియెట్ దూరవిద్య పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులను శుక్రవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ, ఆయా తేదీలలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాలలో 2,117 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో దూరవిద్య సమన్వయకర్త కె.ఎం.ఎ. హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

26న మల్లయ్య గట్టుకు లాంచీలు



విజయపురి సౌత్: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి (మల్లయ్య గట్టుకు) ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక లాంచీలను నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా తెలిపారు. శుక్రవారం విజయపురి సౌత్‌లోని లాంచీ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుపు నుంచి ఆ రోజు ఉదయం 7 - మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధరను పెద్దలకు రూ.200, ఐదేళ్లు దాటిన పిల్లలకు రూ.150గా నిర్ణయించామన్నారు. రంగనాయకుల స్వామిని దర్శించుకొని ఏలేశ్వర స్వామి గట్టుకు భక్తులు వెళ్లడం ఆనవాయితీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధారణంగా ఎవరైనా అభివృద్ధి పనులను కాంట్రాక్టు తీసుకోవడం విని ఉంటారు.. కానీ సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు ఒకరు కాంట్రాక్టు తీసుకున్నారు. కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల్లో గెలవడానికి భారీగా ఆర్థిక సహాయం చేయడమే ఆయనకున్న అర్హత. ఫలితాలు రాగానే పెత్తనం మొత్తం కాంట్రాక్టరుకు వచ్చింది. దీనిపై తెలుగు తమ్ముళ్లే రుసరుసలాడుతున్నారు. పార్టీలో దశాబ్దాలుగా పని చేసిన తమకు కాకుండా అన్ని పార్టీలతో అంటకాగే వ్యక్తికి పెత్తనం ఇవ్వడంపై మండిపడుతున్నారు. ఎమ్మెల్యే, ఆ కాంట్రాక్టర్ కలసి ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని, అడ్డుకోకుంటే నియోజకవర్గంలో టీడీపీకి పుట్టగతులు ఉండవంటూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు.

అమ్మో.. కేడీ ట్యాక్స్

- సత్తెనపల్లి ప్రజలను పీడిస్తున్న కన్నా–దరువూరి ద్వయం
- కాంట్రాక్టరు దరువూరికి నియోజకవర్గ బాధ్యతలు
- పదవి లేకపోయినా ప్రభుత్వ పనులకు ప్రారంభోత్సవాలు
- రెవెన్యూ, పోలీసు అధికారులకూ అతని మాటే వేదం
- ఎమ్మెల్యే తరఫున వసూళ్లకు బరితెగింపు
- మాట వినని అధికారులపై తప్పని బదిలీ వేటు
- ఇప్పటికే మండలాల్లో పెత్తనమంతా కన్నా కుమారులదే
- దోపిడీలో తమకు అవకాశం లేక తెలుగు తమ్ముళ్ల మండిపాటు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఇటీవల ఎన్నికల్లో సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ గెలుపొందారు. దీనికి అంగ, ఆర్థిక బలాన్ని నియోజకవర్గానికి చెందిన బడా కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు అందజేసినట్లు ప్రచారం. ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత నియోజకవర్గంలో రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల పోస్టింగులు మొదలు అన్ని వ్యవహారాలు దరువూరి చూస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతున్నారు.



లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున సరకులు అందిస్తున్న దరువూరి నాగేశ్వరరావు (ఫైల్)

ట్యాక్స్ కట్టాల్సిందే...

సత్తెనపల్లి పరిధిలోని మట్టి, రేషన్ మాఫియా, కాంట్రాక్టులు, మైనింగ్.. ఇలా అన్ని పనులకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు ఎమ్మెల్యే తరఫున సదరు కాంట్రాక్టరే చూస్తున్నారట. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేసి బిల్లులు పెండింగ్‌లో ఉన్న వారు పనిని బట్టి 5–10 శాతం కేడీ ట్యాక్స్ కడితే డబ్బులు పడిపోతున్నాయనే ప్రచారం నడుస్తోంది. అధికారికంగా దరువూరి నాగేశ్వరరావుకు ఏ పదవీ లేకపోయినా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బదులుగా ఆయనే ప్రారంభించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో లబ్ధిదారులకు సరకులను అందజేస్తున్నారు. ఆయన ఏ అధికార హోదాతో ఇవన్నీ చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గంలో అధికారులకు అతను చెప్పిందే వేదం. కాదంటే బదిలీ వేటు వేసి పంపేస్తున్నారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు

తమ్ముళ్లు బేజారు...

ఎమ్మెల్యే కన్నా కుమారులు నాగేంద్ర, ఫణీలు ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు రూరల్ మండలాలకు దాదాపు రాజులుగా వ్యవహరిస్తున్నారని, ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరికి తోడు షాడో ఎమ్మెల్యే రావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కన్నా కుమారులపై చంద్రబాబు, లోకేష్‌లకు భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు, కూటమి పార్టీల నేతలు గుర్రుగా ఉన్నారు. పార్టీ కోసం పనిచేసిన తమను పక్కన పెట్టి కాంట్రాక్టర్‌కు పెత్తనం ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే గుంటూరులో ఉంటున్నారని, తమకు ఏ చిన్న అవసరం ఉన్నా దరువూరిని కలవాల్సిన దుస్థితి నెలకొందని మండిపడుతున్నారు. ముఖ్యంగా జనసేన నేతలకు ఏమాత్రం ప్రాధాన్యత దక్కడం లేదని వాపోతున్నారు.

అన్ని గ్రామాలకు
తాగునీరు అందించాలి

నీటిపారుదల శాఖ అధికారులకు కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశం

నరసరావుపేట: జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగు నీరు సక్రమంగా సరఫరా చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన రెండు రిజర్వాయర్లలో సరిపడా నీరు లేనందున సాగుకు 'వారబందీ ప్రక్రియ' ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. అన్ని చెరువులలో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాకు నిత్యం ఎంత నీరు అవసరం వంటి విషయాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. నీటి వృథా అరికట్టడంలో భాగంగా చెరువుల నుంచి నీరు లీకేజీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కూడా సాగునీటి సద్వినియోగంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఇ.మురళి మాట్లాడుతూ... రైతులు వరి బదులుగా లాభదాయక పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్, ఈఈలు మురళీకృష్ణ, శ్రీహరి, ప్రేమ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహణ

నార్నెపాడు (ముప్పాళ్ళ): రైతుల సమక్షంలోనే రీసర్వే ప్రకియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. సర్వే జరిగే పొలం యజమానితో పాటుగా హద్దుదారులైన రైతులను కూడా సిబ్బంది పిలవాలని సూచించారు. ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే నెంబర్ల ఆధారంగా భూ విస్తీర్ణంపై ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే పూర్తయిందో తెలుసుకున్నారు. సర్వే పూర్తయిన భూముల వివరాలు సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీసర్వే పూర్తి చేయాలన్నారు. రైతులతోనూ మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.భవాని శంకర్, మండల సర్వేయర్ టి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నార్నెపాడులో రీసర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

భూ అక్రమాలపై నివేదిక కోరిన జిల్లా కలెక్టర్

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల గ్రామంలోని ఎద్దుల బీడు విక్రయం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం దృష్టి సారించింది. ఎద్దుల బీడు ఫర్ సేల్ అనే కథనాన్ని సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆరా తీశారు. అక్రమాలపై నివేదిక పంపాలని గురజాల ఆర్డీవోను ఆదేశించారు. దీంతో దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం అధికారులతో ఆర్డీవో మాట్లాడారు. పూర్తి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్ఎస్ఆర్‌తో పాటుగా ప్రస్తుత రికార్డులను పరిశీలిస్తున్నారు. మాజీ సర్పంచ్ కుటుంబం ఎంత భూమిని ఆన్‌లైన్ చేయించుకుంది? దీంట్లో అక్రమమెంత? వంటి విషయాలు తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. రెవెన్యూ సిబ్బంది పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. సర్వేయర్, వీఆర్వోలు ఎద్దుల బీడు వద్దకు వెళ్లి పరిశీలించారు.

నల్లమలలోనూ
నీటికి విలవిల



ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయిన రేగుల కుంట

మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో అడవిలోనూ నీటికి కటకట తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో చాలా కుంటలు ఎండిపోతున్నాయి. ఒకప్పుడు ఏటా వర్షాలు పడే వరకు ఎంతో కొంత నీరు కుంటల్లో ఉండేది. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడినా ప్రస్తుతం ఎండిపోవడం పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. మూగజీవాలకు తాగునీరు లభించడం లేదు.

కారెంపూడి: పల్నాడు జిల్లా పరిధిలోని నల్లమల అడవిలో దాదాపు 40 కుంటలు ఉన్నాయి. వాటిలో ఇప్పుడు దాదాపు అన్నీ ఎండిపోయాయి. పెద్దవైన రెండు మూడింట్లో, కాస్త పెద్ద చెరువుల్లో తప్పితే అడవిలో నీటి జాడ లేకుండా పోయింది. సహజ సిద్ధంగా నీరు ఉబికి వచ్చే బుగ్గల నుంచి కూడా జలం రావడం లేదు, సింగరుట్ల లక్ష్మీనరసింహ స్వామి గుడి వద్ద, ధనమల్లయ్య స్వామి గుడి వద్ద, బ్రహ్మదేవుడి గుడి వద్ద రాళ్ల మధ్య నుంచి ఉబికొచ్చే జలాలు సరిగా రావడం లేదు. ఒకప్పుడు మండు వేసవిలో కూడా అడవికి వెళ్లిన వారి దాహార్తిని ఇవి తీర్చేవి. ఇప్పుడు నీటి జాడ కరవైన పరిస్థితి నెలకొంది. అడవిలో నీరు లేకపోతే లక్షల పక్షులు, వన్యప్రాణులకు ఇబ్బంది తప్పదు. అడవి పందులు, ఇతర వన్యప్రాణులు సమీప పొలాలు, ఇళ్లలోకి వస్తున్న జాడలు కన్పిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. బోర్ల ద్వారా పంటలకు నీరు పెడుతుండటంతో అవి పొలాల్లోకి చొరబడుతున్నట్లు తెలిపారు. కాకిరాల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని రేగుల కుంటలో గత ఏడాది ఇదే సమయంలో నీరుంది. ఇప్పుడు లేవు. అలాగే మిగిలిన కుంటలు కూడా నీరు లేక నెర్రెలిచ్చి కన్పిస్తున్నాయి.

పరిరక్షణే శరణ్యం..

దీనికి ప్రధాన కారణం నీరు ఆవిరి కాకుండా కాపాడే వృక్షజాతులు కుంట పరిసర ప్రాంతాలలోని అడవిలో అంతరించి పోవడం, వాయు కాలుష్యం వంటివని అధికారులు పేర్కొంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు లేకపోవడం వల్ల కుంటల్లో నీరు నిలవని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా కుంటల పరిసర ప్రాంతాలలో ఎక్కడైనా గతంలో మర్రి, రావి లాంటి భారీ చెట్లు ఉండేవి. అవి పక్షులకు ఆవాసంగా ఉపయోగపడడంతోపాటు ఆహారాన్ని కూడా అందించేవి. అలాంటి వాతావరణం ఇప్పుడు లేదు. వర్షాలప్పుడు నిండిన కుంటలు ఏడాది పొడవునా సమస్త ప్రాణికోటికి జీవాధారంగా ఉండేవి. అలాంటి పరిస్థితి నేడు లేకుండా పోయింది. ఫిబ్రవరిలోనే కుంటలు ఎండిపోయిన నేపథ్యంలో రానున్న మండు వేసవిలో ఇబ్బందులు మరింత పెరగనున్నాయి. పల్నాడు జిల్లా పరిధిలో నల్లమల అడవిలో 40 వరకు కుంటలున్నాయి. కారెంపూడి మండల పరిధిలో రేగుల కుంట, ఎర్ర కుంట, గురమ్మ కుంట, నక్కోడి కుంట, చీమల కుంట, పుట్టు కుంట, మేకల కుంట, గాలి కుంట, అచ్చెమ్మ కుంట, కొండ కుంట, కోమటి కుంట ప్రధానమైనవి. పెద్దదైన కోమటి కుంటలో తప్పితే మిగతా వాటిలో ఫిబ్రవరి నెలలోనే నీరు లేదు. గత ఏడాది ఇదే సమయానికి రేగుల కుంటలో నీరు ఉంది.



2020 వేసవిలో రేగుల కుంటలో నీరు (ఫైల్)

నీటి వనరుల సంరక్షణ అవసరం



రేగుల కుంట వద్ద నాటిన మొక్కలకు గతేడాది నీరు పోశాను. ఇప్పుడు అక్కడ చుక్క కూడా నీరు లేదు. దీని వల్ల మూగజీవాలు, పక్షులు వలస వెళ్తాయి. నెమళ్లు, అడవి కోళ్ల వంటి జాతులు మృత్యువాత కూడా పడతాయి. అడవి పందులు, జింకలతోపాటు వన్యప్రాణులు పొలాల్లోకి, సమీప గ్రామాల్లోకి కూడా వచ్చే అవకాశం ఉంది. భారీగా వర్షాలు పడని ఏడాది కూడా ఇలాంటి పరిస్థితి రాలేదు. మళ్లీ వాన జాడ కన్పించే వరకు నీరుండేది. ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణం పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టకపోవడమే. తగిన చర్యలు తీసుకోకపోతే అడవంతా ఇదే పరిస్థితి రావచ్చు. జల వనరులను సంరక్షించాలి.

– కొమెర అంకారావు (జాజి), పర్యావరణవేత్త



ఆలయ ముఖ ద్వారానికి రంగులు వేస్తున్న దృశ్యం



అధ్వానంగా గురవాయపాలెం - కోటప్పకొండ లింక్ రోడ్డు

రేపటి నుంచి కోటప్పకొండ తిరునాళ్ల

- ఆదివారం నుంచి భక్తుల రాక
- 26న మహా శివరాత్రి తిరునాళ్ల జాగరణ
- త్రికోటేశ్వరుడిని దర్శించుకోనున్న లక్షలాది మంది భక్తులు
- ఇంకా కొనసాగుతున్న ఏర్పాట్లు
- పూర్తికాని రహదారుల మరమ్మతులు
- తుది దశకు పెయింటింగ్ పనులు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అప్పటి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం కానుంది. మహా శివరాత్రిని పురస్కరించుకొని 26వ తేదీన తిరునాళ్ల జాగరణతో ఉత్సవాలు పూర్తవుతాయి. లక్షల మంది భక్తులు తరలివచ్చే తిరునాళ్ల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ తిరునాళ్లకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. లక్షల మంది స్వామిని దర్శించుకొని తిరునాళ్లలో పాల్గొంటారు. శివరాత్రి జాగరణ పాటిస్తారు. శివరాత్రి ముందు వచ్చే ఏకాదశి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది ఏకాదశి ముందు రోజు ఆదివారం రావడంతో ఆ రోజు నుంచి బుధవారం వరకు భక్తులు తరలి రానున్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యమే..

తిరునాళ్ల కోసం జిల్లా అధికారులు రెండు నెలల ముందే సమాయత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు జరిగాయి. ఈ నెల 20వ తేదీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు అవి పూర్తి కాలేదు. తిరునాళ్లకు ఒకరోజు ముందు ఏర్పాట్లు పైపైన చేయాలనే భావనలో పలు శాఖలు ఉన్నాయి.



ధ్యాన శివుని విగ్రహం వద్ద పూర్తికాని పనులు

హడావుడిగా పనులు..

ఆఖరి నిమిషంలో పలు పనులు పూర్తి చేయడం ప్రభుత్వ శాఖలకు పరిపాటిగా మారింది. కొండ కింద తిరునాళ్ల జాగరణలో లక్షల మంది పాల్గొంటారు. వీరి కోసం పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీపాలు, బ్యారికేడ్ వంటి పనులు పూర్తిచేయాలి. రేపటి నుంచి కొండకు భక్తుల రాక ప్రారంభం అవుతున్నా ఆయా పనులు పూర్తి కాలేదు. ఆర్‌అండ్‌బీ నిర్వహించే బ్యారికేడ్ పనులు ప్రారంభించనే లేదు. విద్యుత్ దీపాలు ఏర్పాటు పనులు రెండు రోజుల క్రితం మొదలు పెట్టారు. తాగునీటి కొళాయిలు, తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేస్తున్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద నూతనంగా అందుబాటులో తీసుకువచ్చిన శివ కుటుంబం వద్ద మెట్లకు గ్రానైట్, రైలింగ్ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కొండకు వచ్చే లింక్ రోడ్లకు మరమ్మతులూ పూర్తి కాలేదు.

ప్రధాన ఆలయంలోనూ అసంపూర్తి

కొండపైన ప్రధాన ఆలయ ప్రాంగణంలోని పలు ఉప ఆలయాలకు రంగులు వేసే పనులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఆలయ ముఖ ద్వారానికి రంగులు వేస్తున్నారు. ధ్యానశివుని విగ్రహానికి రంగులు వేసే పని మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. ఆదివారం నుంచి భక్తులు రాక ప్రారంభమవుతున్నా షామియానా పనులు పూర్తి కాలేదు.

ఆదివారానికి పూర్తి చేస్తాం

తిరునాళ్ల కోసం ఆలయంలో చేపట్టిన పనులు ఆదివారం నాటికి పూర్తవుతాయి. రంగులు వేసే పనులు తుది దశకు చేరుకున్నాయి. కోతుల బెడద కారణంగా షామియానాలు ఆదివారానికి పూర్తి చేయాలని నిర్ణయించాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డి.చంద్రశేఖరరావు, ఆలయ ఈవో

రైతు బజార్లలో విక్రయాలకు ఏర్పాట్లు

నరసరావుపేట: కూరగాయలు పండించే అన్నదాతలు కోరితే ఉద్యాన శాఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శులు స్పందించి రైతుబజార్లలో సరకు విక్రయించుకునే అవకాశం ఇవ్వాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ధరల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయల పంటల వివరాలను అధికారులను అడిగి జేసీ తెలుసుకొన్నారు. గిట్టుబాటు ధర లేకుంటే నేరుగా రైతుబజార్లలో అమ్ముకోవడానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. లేదంటే అధికారులే కొనుగోలు చేసి రైతుబజార్లలో విక్రయించేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.సూర్య ప్రకాష్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి, చిలకలూరిపేట రైతు బజారు ఎస్టేట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే

క్లుప్తంగా

25న శివరాత్రి సమన్వయ కమిటీ సమావేశం

అమరావతి: పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ మాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాల సమన్వయ కమిటీ మూడో సమావేశం ఈ నెల 25వ తేదీన జరగనుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి ఆర్‌డీవో రమణకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో సమావేశం ఉంటుందని చెప్పారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు (మోడల్ స్కూల్స్) 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. జిల్లా పరిధిలోని 14 ఆదర్శ పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 – మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్షను ఆయా మండలాలలోని ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యానికి రైతులను ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ హాలులో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, ప్రణాళిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఐదు రోజులపాటు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ప్రకృతి సేద్య ఆవశ్యకతను వివరించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి రామారావు, అధికారులు చక్రవర్తి, గోపీచంద్, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచాలి

జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ పి. అరుణ్‌బాబు

నరసరావుపేట: వ్యవసాయ, ఉద్యాన, వెలుగు తదితర శాఖల అధికారులు, సిబ్బంది అందరూ ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంపులో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. ప్రస్తుతం రసాయనిక పురుగు మందులు అధికంగా వాడటం వల్ల రైతులకు పెట్టుబడి పెరిగి, ఆదాయం తగ్గుతోందన్నారు. భూమి కూడా సారం కోల్పోతున్నట్లు చెప్పారు. పంటలలో పురుగు మందుల అవశేషాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ప్రధాన పంటకు ముందుగా వేసవిలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) 30 రకాల విత్తనాలను రైతులందరూ నాటేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. అన్ని సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ఒక అజెండాగా చేర్చాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించారు. ప్రతి సోమవారం అన్ని మండలాల్లో ఈ తరహా ఏర్పాటు చేయటం శుభ పరిణామం అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఇ.మురళి మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిలో జరిగే కార్యాచరణ ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా యాంకర్ కె.రామచంద్రం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తొమ్మిది సార్వత్రిక సూత్రాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ.. రైతులకు లాభదాయకమైన అంశాలు వెల్లడించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద టెర్రస్ గార్డెనింగ్, పెరటి తోట పెంపకం చేపట్టాలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా వీఏఏ, వీహెచ్ఏలను ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి సహాయాన్ని అందించామన్నారు. ప్రకృతి సాగు చేస్తున్న పెదకూరపాడు రైతు దర్శి శేషారావు, నకరికల్లు రైతు రుసుం సాంబశివరావులను సన్మానించారు. జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ రజిని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న కలెక్టర్

సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

దమ్మాలపాడు (ముప్పాళ్ళ): గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి చెప్పారు. దమ్మాలపాడు గ్రామంలో ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని, ఎన్‌సీడీ– సీడీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పంచాయతీ సిబ్బందితో పని చేయించాలన్నారు. రోడ్ల వెంబడి చెత్త లేకుండా చూడాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేలో భాగంగా ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మార్చి 30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, సీహెచ్ఓ హర్షవర్ధన్, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎ.పీటర్ డేమియన్, ఎస్‌కే రహిమాన్, ఏఎన్‌ఎం మస్తాన్‌బీ, ఆశా కార్యకర్తలు సుభాన్‌బీ, సుబ్బమ్మ, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

తెనాలి: కృష్ణ–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో తెనాలిలో శుక్రవారం ఓటు హక్కు అవగాహన ర్యాలీని నిర్వహించారు. 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరుస్తూ తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు.

తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు దుర్గాభాయ్, కె.సంజీవరావు, సిబ్బందితో కలిసి ప్రదర్శనగా బయలుదేరారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి కొత్తపేట, బోసురోడ్డు మీదుగా గాంధీచౌక్ వరకూ చేరుకున్నారు. అక్కడ మానవ హారం నిర్వహించి ఓటు హక్కు వినియోగం గురించి ప్రతిజ్ఞ చేశారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తెనాలి అర్బన్ , రూరల్ కలిసి 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని చెప్పారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇక్కడ పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, ఈ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ నిర్వహణ గురించి అధికారులు తెలియజేశారు. వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభించిన సబ్ కలెక్టర్ సంజనా సింహ

మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

నాదెండ్ల: ప్రతి చిన్నారి తన మాతృభాషలోనే సమాజాన్ని పరిచయం చేసుకుంటాడని, తల్లిలాంటి మాతృభాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెలొలికే తెలుగు దేశభాషల్లోనే విశిష్టమైనదని పేర్కొన్నారు. మాతృభాషను మరువకుండా మరో భాషను నేర్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. తరాలు మారేకొద్దీ మాతృభాష ప్రాధాన్యత తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మాతృభాషలోనే మాట్లాడుకోవటం, చదవటం, రాయటం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నడికట్టు రామిరెడ్డి

పండ్లతోటల పెంపకంపై రాయితీ

నరసరావుపేట రూరల్: పండ్లతోటల పెంపకంపై ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త నాగేష్ తెలిపారు. మండలంలోని పమిడిమర్రులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త నాగేష్, ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి ధర తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పండ్ల తోటలు లాభదాయకంగా ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద శాతం రాయితీలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో ఉద్యాన పంటలకు ఇచ్చే రాయితీని వచ్చే 2025–26 నుంచి పెంచినట్టు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన



ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రచారం
- కూటమి నేతల తీరుపై కనీస చర్యలు శూన్యం
- విపక్ష నాయకులపై మాత్రం కేసులు నమోదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారుల పక్షపాతంపై తీవ్ర విమర్శలు

సాక్షి, నరసరావుపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం కోడ్ అమలులో ఉంది. అధికార కూటమి నాయకులు మాత్రం అదేమీ పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వినుకొండ నియోజకవర్గంలో కూటమి నాయకులు కోడ్ పాటించకున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా ప్రభుత్వ చీఫ్ విప్ జీ.వి. ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, బీజేపీ, జనసేన నాయకులు పలు చోట్ల ఇష్టానుసారంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోకి వెళ్లి ప్రచారం చేస్తుండటం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే జీ.వి.ఆంజనేయులు తనదైన శైలిలో ప్రభుత్వ కార్యాలయాల్లోకి నేరుగా వెళ్తున్నారు. ఆయన ప్రచార తీరు చూసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే మక్కెన కూడా నూజెండ్ల మండలం తిరునాళ్లకు వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఫొటోలు దిగారు. బీజేపీ నాయకులు ఏకంగా ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి ఓట్లు అభ్యర్థించడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతిపక్ష నేతలకే 'కోడ్'

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తదితరులు ఇటీవల గుంటూరు మిర్చి యార్డును సందర్శించి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వెళ్లారు. కానీ ఎన్నికల కోడ్ అమలులో ఉందంటూ తొలుత అనుమతి కూడా ఇవ్వలేదు. అన్నదాతలను ఓదార్చడానికి వెళ్లినందుకు కేసులు నమోదు చేయడం గమనార్హం. కానీ అధికార పార్టీ నాయకులు మాత్రం అడ్డగోలుగా ప్రచారం చేస్తున్నా నిబంధనలు వర్తించడం లేదు. అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా స్పందించి ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

నకిలీ బంగారాన్ని పట్టుకున్న బ్యాంక్ అధికారులు

పోలీసులకు వ్యక్తి అప్పగింత

అద్దంకి రూరల్: తాకట్టు పెట్టేందుకు బ్యాంకుకు తెచ్చిన బంగారం నకిలీదిగా గుర్తించి బ్యాంకు అధికారులు ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం అద్దంకి పట్టణంలో చోటు చేసుకుంది.అద్దంకికి చెందిన వ్యక్తి ఓ బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టటానికి గాజులు తీసుకువచ్చాడు. వాటి నాణ్యతను అధికారులు పరీక్షించగా, అవి నకిలీవిగా నిర్ధారణ అయ్యాయి. ఇదే వ్యక్తి వారం రోజుల కిందట వేరే బ్యాంకులో కూడా నకిలీ బంగారం పెట్టి రుణం తీసుకున్నాడని తెలియడంతో, రెండు బ్యాంకుల అధికారులు నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

అడ్వాన్స్ తిరిగివ్వాలని కోరితే బెదిరింపులు

వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఇంటి కొనుగోలుకు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి వ్వాలని అడిగినందుకు బెదిరింపులకు దిగిన ఓ వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. వేళంగిణి నగర్ ప్రాంతానికి చెందిన కర్రా విజయరాణి, ఆమె భర్త తెనాలి రాజశేఖర్ అనే గుంటూరు ముత్యాలరెడ్డినగర్‌లోని ఒక ఇల్లు కొనుగోలుకు నిర్ణయించారు. దీనికోసం చైతన్యపురి కాలనీకి చెందిన కురాకుల శ్రీనివాసరావు, శోభారాణిలకు అడ్వాన్స్‌గా రూ.20లక్షలు చెల్లించారు. తీరా ఇల్లు పూర్తిగా పరిశీలించగా నచ్చకపోవడంతో ఇల్లు బాగోలేదని, అడ్వాన్స్ తిరిగివ్వాలని కోరారు. అయితే నగదు తిరిగివ్వకుండా శ్రీనివాసరావు, శోభారాణి మూడు నెలలుగా కాలయాపన చేస్తు వచ్చారు. గురువారం శ్రీనివాసరావు, శోభారాణి ఇంటి వద్దకు వెళ్ళి డబ్బులు ఇవ్వాలని కోరగా బాధితురాలు విజయరాణిపై దుర్భాషలాడి, హతమారుస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో బాధితురాలు గురువారం రాత్రి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలస కూలీల మినీ లారీ బోల్తా

ఆరుగురికి గాయాలు

మేడికొండూరు: వలస కూలీలతో వెళుతున్న మినీ లారీ రోడ్డుపై బోల్తా కొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సత్తెనపల్లి రోడ్డులో గుళ్ళపాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన వలస కూలీలు 25 మంది గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో మేడికొండూరు సమీపంలోని గుండ్లపాలెం పెట్రోల్ బంక్ వద్ద మినీలారీ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఘటనలో లారీలో ఉన్న రాజ్ కుమార్ చంద్రమ్మలకు తీవ్ర గాయాలు అవ్వగా మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 సహాయంతో తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.



బోల్తా కొట్టిన మినీ లారీ

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

మేడికొండూరు: ఆటోను వ్యాన్ ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పేరేచర్ల కాల్వ సమీపంలో జరిగింది. పేరేచర్ల నుంచి మేడికొండూరు వైపు వెళ్తున్న ఆటోను గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటార్ల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రూ.లక్ష విలువ చేసే ఐదు మోటార్లు స్వాధీనం



నిందితులతో రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది

చీరాల: మోటార్ల చోరీ కేసులో ఇద్దరిని ఈపురుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెంలోని పొలాల్లో నీళ్ల మోటార్లు చోరీకి గురికావడంతో గ్రామానికి చెందిన అక్కల సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన అక్కల గోపిరెడ్డి, కావూరి గోపిరెడ్డి నిందితులని తేలింది. ఇద్దరు మద్యం, చెడు వ్యసనాలకు అలవాటుపడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు పొలాల్లోని మోటార్లను రాత్రిపూట చోరీ చేసి అమ్ముకుంటున్నారు. ఈనెల 15, 17తేదీల్లో ఫిర్యాది అక్కల సాంబయ్య, అతని పక్కనే ఉన్న గుండుబోయిన ఏసురాజు పొలంలో, అదే గ్రామానికి చెందిన అక్కల వెంకటరెడ్డి, కావూరి శ్రీనివాసరెడ్డి, కావూరి శివారెడ్డిలకు చెందిన పొలాల్లోని ఐదు మోటార్లను చోరీ చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు నిందితులను శుక్రవారం సాయంత్రం కావూరివారిపాలెం వై.జంక్షన్ వద్ద అరెస్టు చేశారు.

రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్స్ రికవరీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ల వివరాల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అప్పగిస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి చెప్పారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు రూ.46.60 లక్షల విలువైన 234 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం బాధితులకు అప్పగించారు. ఏఎస్పీ మాట్లాడుతూ బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సెల్‌ఫోన్లు పొయినట్‌లైతే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మాట్లాడితే ఆ నంబర్లను బ్లాక్ చేసి, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్ లేదా జాతీయ సైబర్ భద్రత టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలని అన్నారు.

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ముందు 24వ తేదీ ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ చెప్పారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీ నాడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నా కార్యక్రమాల్లో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, కార్పెంటర్ యూనియన్ నాయకులు కాయల రామారావు, బొట్టు శ్రీనివాసరావు, చల్లా మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

• తుది దశకు మూడు వంతెనల పనులు



గుంటూరు నగరంలో రైల్వే శాఖ చేపట్టిన మూడు వంతెనల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 25వ తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది నవంబర్ 26న వంతెనల నిర్మాణ పనులు చేపట్టారు. త్వరగానే పనులు పూర్తి చేస్తామని తొలుత ప్రకటించారు. వాటర్ పైప్‌లైన్‌లు అడ్డురావడంతో జాప్యం జరిగింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు